www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 5 జులై 2024

5

వైఎస్ఆర్





స్వాతంత్ర్య సమరయోధులు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి ఉత్సవాలను కలెక్టరేట్ స్పందన హాలులో స్టెప్, పర్యాటక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా డిఆర్ఒ గంగాధర్‌గౌడ్, ఇతర శాఖల అధికారులు అల్లూరి చిత్రపటానికి నివాళులర్పించారు.

వార్త 6లో

ర్యాటిఫికేషన్...చిటపటలు

- శ్మశాన పనుల్లో నిర్లిప్తతపై సీరియస్
- పింఛన్ల పంపిణీకి ఆహ్వానం లేకపోవడంపై నిరసన
- బుగ్గవంక బ్యూటిఫికేషన్‌పై నిలదీత
- జనరల్ ఫండ్ చెల్లింపులపై విమర్శలు
- 15వ ఫైనాన్స్ నిధుల వివరాలు కావాలి
- కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే, కౌన్సిలర్ల ప్రశ్నాస్త్రాలు



కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో డిప్యూటీ మేయర్, ప్రజాప్రతినిధులు





సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు, మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కార్పొరేషన్ అభివృద్ధి పనుల్ని ర్యాటిఫికేషన్ పేరుతో కేటాయించడం సరికాదని, ప్రతి పైసా ఖర్చుపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే మాధవి పేర్కొన్నారు. గురువారం డిప్యూటీ మేయర్ ముంతాజ్‌బేగం అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథులుగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, కడప, కమలాపురం ఎమ్మెల్యేలు మాధవి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నగర పాలక సంస్థ దృష్టికి పలువురు కార్పొరేటర్లు ప్రస్తావించిన 16 అంశాలపై కూలంకషంగా చర్చించే ప్రయత్నం చేశారు. కడప కార్పొరేషన్ పరిధిలో రూ.69.20 కోట్లతో చేపట్టిన 22 డ్రెయినేజీ పనులను ర్యాటిఫికేషన్ పేరుతో చేపట్టడాన్ని ఆక్షేపించారు. కార్పొరేషన్ పాలకవర్గం అందుబాటులో ఉన్నప్పటికీ ర్యాటిఫికేషన్ పేరుతో పనులు కటబెట్టడం సరికాదని, అభివృద్ధి పనుల్ని ర్యాటిఫికేషన్ పేరుతో చేపడితే పాలకవర్గ కార్పొరేటర్లు ఉండి లాభమేమిటని ప్రశ్నించారు. కమిషనర్ స్పందించి 2023 డిసెంబర్, జనవరి మాసాల్లో పనులు చేపట్టాలని ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో త్వరితగతిన అభివృద్ధి పనులు చేపట్టాల్సి వచ్చిందని వివరించారు. రూ.49 కోట్ల బుగ్గవంక సుందరీకరణకు కార్పొరేషన్ జనరల్ ఫండ్ నుంచి సుమారు మూడు కోట్ల రూపాయలు మళ్లించాల్సిన అవసరం ఏమొచ్చిందని కార్పొరేటర్ పాకా సురేష్ నిలదీశారు. బుగ్గవంక పనుల పురోగతి ఆశించిన మేర లేదని, అటువంటి సమయంలో జనరల్ ఫండ్ నిధులు ఎక్కడ కేటాయించారో చెప్పాలని నిలదీశారు. దీనిపై ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ స్పందించి బ్యూటిఫికేషన్, రహదారి పనుల బిల్లుల చెల్లింపుల నిమిత్తం రూ.మూడు కోట్లు కేటాయించిన మాట వాస్తవమేనని, బిల్లుల్ని సిఎఫ్ఎంఎస్‌కు అప్‌లోడ్ చేశామని, బిల్లులు చెల్లింపులు జరిగిన వెంటనే రీఫండ్ చేస్తామని తెలిపారు. 15 ఫైనాన్స్ నిధుల్ని మళ్లించినట్లు సమాచారం ఉందని, 2020, 2021, 2022, 2023 ఆర్థిక సంవత్సరాల పనుల కేటాయింపులు, బిల్లుల చెల్లింపుల వివరాలు కావాలని ఎమ్మెల్యే మాధవి కోరారు. కమిషనర్ స్పందించి గతేడాది రెండు విడతలుగా రూ.71 కోట్ల మేరకు 15 ఫైనాన్స్ నిధులు వచ్చాయని, ఇందులో రూ.30 కోట్ల మేర ఖర్చులు చేశామని, త్వరలో వివరాలనుఅందజేస్తామని వివరించారు. 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు, ర్యాటిఫికేషన్ పేరుతో అభివృద్ధి పనుల కేటాయింపు వివరాలేమీ తమకు తెలియదని పేర్కొనడం గమనార్హం. స్కేటింగ్‌రింగ్ కూల్చివేతపై సభ్యుని ప్రశ్నకు సమాధానంగా రూ.32 లక్షల కేటాయించామని, ఇందులో తొమ్మిది లక్షల రూపాయలు ఖర్చు చేశామని సంబంధిత ఇంజినీర్ వివరించారు. కమిషనర్ స్పందించి రూ.50 లక్షలు శాప్ నిధులు, కార్పొరేషన్ రూ.30 నుంచి రూ.50 లక్షలు, కలెక్టర్ ఫండ్స్ నుంచి రూ.రెండు కోట్ల వ్యయంతో అత్యాధునిక స్కేటింగ్ రింగ్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కడప నగరాభివృద్ధికి డ్రెయినేజీ వ్యవస్థ అత్యావశ్యకమని వివరించారు. రూ.69.20 లక్షలతో 22 డ్రెయినేజీ వ్యవస్థల్ని ఆధునీకరిస్తున్నామని తెలిపారు. ఆర్టీసీ బస్టాండు ఆవరణం నుంచి స్టేట్‌గెస్ట్‌హౌస్ మీదుగా బుగ్గవంక మీదుగా పనులు ముమ్మరంగా ముందుకు సాగుతున్నాయని వివరించారు. కడప నగరంలో 16, 34, 35వ డివిజన్లు సహా నానాపల్లి ప్రాంతాల్లో శ్మశానాల ఏర్పాటుపై నిర్లక్ష్యం నెలకొనడంపై ఎమ్మెల్యే మాధవి ఆందోళన వ్యక్తం చేశారు. నకాష్ నానాపల్లి ప్రాంతాల్లోని శ్మశానాల స్థలాల్లో మోకాటిలోతు నీళ్లు ఉన్నాయని, అక్కడ శ్మశాన సంబంధిత వ్యవహారాలు ఎలా సాగుతాయని ప్రశ్నించారు. వీలైనంత త్వరగా 34, 35వ డివిజన్ల పరిధిలో కబరస్తాన్‌లను ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని వివరించారు. అనంతరం ప్రభుత్వం ఇటీవల చేపట్టిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి కార్పొరేటర్లకు ఆహ్వానం అందకపోవడంపై పలువురు కార్పొరేటర్లు నిరసన తెలిపారు. ఎమ్మెల్యే మాధవి స్పందించి ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఆలస్యంగా అందడంతో ఎవరినీ పిలవలేకపోయామని వివరించారు. ఎర్రముక్కపల్లి మీదుగా సాయిప్రతాప్‌నగర్ ప్రాంతానికి వెళ్తున్న రైల్వేబ్రిడ్జి కారణంగా ఇళ్లు కోల్పోయేవారికి న్యాయం చేయాలని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి దృష్టికి డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి తీసుకెళ్లారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించే ప్రయత్నం చేశారు. సర్వసభ్య సమావేశానికి ఎన్నడూ లేని రీతిలో ఎమ్మెల్యేల అనుచరులు పెద్దఎత్తున రావడంతో స్థలా భావం సమస్య తలెత్తింది. కార్పొరేషన్ సర్వసభ్య సమావేశానికి పలువురు కౌన్సిలర్లు, ఇతర సభ్యులు పెద్దఎత్తున ఎమ్మెల్యే అనుచరులు హాజరయ్యారు.



పింఛన్ల పంపిణీకి ఆహ్వానించకపోవడంపై నిలదీస్తున్న 49వ డివిజన్ కార్పొరేటర్ ఉమాదేవి

దేశ వ్యాప్త విద్యా సంస్థల

బంద్ విజయవంతం

నీట్ పరీక్షలు రద్దు చేయాలి

విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్

నీట్ పరీక్షను రద్దు చేయాలని దేశ వ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ జిల్లాలో విజయవంతం అయింది. నగరంలోని బాలికల కళాశాల ఎదుట విద్యార్థి సంఘాల నాయకులు బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గుజ్జుల వలరాజు, ఎస్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు, పిఆర్ఎస్ వైఫ్ జిల్లా కన్వీనర్ నాగేంద్రబాబు, ఆర్ఎస్‌యు జిల్లా కార్యదర్శి చెన్నకేశవ, ఎన్ఎస్ఎస్ఎఫ్, జిల్లా అధ్యక్షులు ప్రసన్న కుమార్, ఎబిబిఎస్ జగన్ నాయక్, ఆర్‌వైఎఫ్ జిల్లా కన్వీనర్ భాస్కర్ మీడియాతో మాట్లాడారు. దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి భారత దేశ సహజ సంపదను కార్పొరేట్ పరం చేసిందని విమర్శించారు. చివరికి విద్యార్థుల ప్రతిభను అమ్ముకునే దిగజారుడు స్థాయికి చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందులో భాగంగానే నీట్ పరీక్ష నిర్వహించిన ఎన్‌టిఎ సంస్థ ప్రశ్నాపత్రాన్ని లీక్ చేసి 67 మంది విద్యార్థులకు ఆల్ ఇండియా ర్యాంక్ వచ్చే విధంగా చేసిందని విమర్శించారు. 1,506 మందికి విద్యార్థులకు పరీక్ష సమయపాలన తక్కువ ఉండడం కారణంగా ఎన్‌టిఎ సంస్థ గ్రేస్ మార్కులు కలిపామని చెప్పడం విడ్డూరంగా ఉందని తెలిపారు. నెట్ పరీక్ష రద్దు సిగ్గుచేటు అన్నారు. వెంటనే ఎన్‌టిఎ సంస్థ లైసెన్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నత విద్యా ప్రమాణాలు కాపాడాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా మూసివేసిన ప్రభుత్వ పాఠశాలలను తిరిగి కొనసాగించాలని తెలిపారు. యూనివర్సిటీ కేంద్రాలలో విద్యార్థుల పైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. పిహెచ్‌డి స్కాలర్లకు ఫెలోషిప్‌లు పెంచాలని మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్పు కొనసాగించాలని పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వం గుజరాత్ మోడల్‌గా చూపిస్తున్న నేపథ్యంలో 11 సంవత్సరాలలో 11 పేపర్లు లీక్ చేసి 201 సభ్యుల పైన కేసు నమోదు చేసినట్టు ఆ రాష్ట్ర శాసనసభలో తెలపడం, 15 రాష్ట్రాల్లో ఉన్నత విద్యకు సంబంధించిన పేపర్లు లీక్ కావడం మోడీ అత్యంత ప్రీతిపాత్రుడు సెకండరీ సర్వీస్ బోర్డు చైర్మన్ అశిత్ ఓరా లాంటి వాళ్ల రాజీనామా విద్యార్థుల ప్రతిభను అమ్ముకుంటున్న నేపథ్యం కనబడడం లేదా అని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా బిజెపి ప్రభుత్వం పునరాలోచన చేయాలని, వైద్య రంగాన్ని, ఉన్నత విద్య ప్రమాణాలను కాపాడాలని చెప్పారు. బిజెపి వైఖరి మార్చుకోకపోతే పెద్ద ఎత్తున దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మనోజ్, ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి కె.శివశంకర్, నగర అధ్యక్షుడు బి.అరుణ్, అకిరానంద్, శివతేజ, మస్తాన్, టిఆర్ఎస్ వై ఎఫ్ నాయకులు వేణు పాల్గొన్నారు. **కాశినాయన :** విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థలు మూసివేసి బంద్‌కు సహకరించాలని మండల కేంద్రమైన నర్సాపురంలోని మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ సౌజన్యకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. విద్యా వ్యవస్థలో జరుగుతున్న అవినీతి అక్రమాలకు వ్యతిరేకంగా బంధ్‌ను నిర్వహి స్తున్నామని తెలిపారు. విద్యార్థులందరూ తరగతులు బహిష్కరించి బంద్‌లో పాల్గొన్నారు. నరసాపురంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశా లలను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మూసి వేయించారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** భారత విద్యార్థి ఫెడరేషన్, డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్, రాయలసీమ విద్యార్థి సంఘం పట్టణంలోని ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బంద్ విజయవంతం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎద్దు రాహుల్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం డేవిడ్ రాజ్,అఖిల భారత విద్యార్థి సంఘం నాయకులు ప్రేమ్, రాయలసీమ విద్యార్థి సంఘం నాయకురాలు హరిత, ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు అభిలాష్, కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** కేంద్ర ప్రభుత్వం నీట్ పై సమగ్ర విచారణ జరపడంలో విఫలం చెందిందని ఇది లీకుల ప్రభుత్వమని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు తెలిపారు. గురువారం దేశవ్యాప్త బంద్‌లో భాగంగా జమ్మలమడుగు లో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థలను మూసివేయించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్, పట్టణ అధ్యక్షులు ఎల్లయ్య, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు సూరి, రాఘవ, దస్తగిరి పాల్గొన్నారు. అలానే పట్టణంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాల, ప్రభుత్వ హైస్కూల్‌లో బంద్ సందర్భంగా బాయ్‌కాట్ చేయి ంచారు. బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించిన సిఐటియు ట్రేడ్ యూనియన్ పట్టణ కార్యదర్శి దాసరి విజయ్, ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు పవన్ , శ్రీనాథ్, హేమ ంత్, రాజు, చింటూ, హర్ష , నాగేంద్ర, విద్యా ర్థులు , సిఐటియు నాయకులు పాల్గొన్నారు. **ముద్దనూరు :** నీట్ పరీక్ష పేపర్ లీకుపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వైఖరికి నిరసనగా విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. మండలంలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు స్వచ్ఛందంగా మూసేశారు. **బ్రహ్మంగారి మఠం :** గురువారం దేశవ్యాప్తంగా జరుగు బంద్‌లో భాగంగా మండలంలో ప్రభుత్వ ప్రవేట్ పాఠశాలను మూసి వేయించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ నరసింహా, ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు రమేష్, మండల సహాయ కార్యదర్శి సందీప్, మండల నాయకులు అరవింద్, దేవా, కాశి పాల్గొన్నారు. **బద్వేలు :** నీట్ పరీక్ష ఫలితాలలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని కోరుతూ విద్యార్థి సంఘాలు ఇచ్చినటువంటి పిలుపు మేరకు బద్వేల్ పట్టణం, రూరల్ ప్రాంతాలలో విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేశామని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని అన్నారు. బంద్ కు సకరించిన విద్యాసంస్థల యాజమాన్యాలను అభినందించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.కె. మస్తాన్ షరీఫ్, గంగనపల్లి నాగార్జున ,ఉపాధ్యక్షుడు యువరాజ్ ,బద్వేల్ రూరల్ అధ్యక్ష కార్యదర్శులు ముడుమాల ఓబుల్ రెడ్డి, ఉప్పులూరు బాల గురయ్యా, ఉపాధ్యక్షులు శంకర్ పాల్గొన్నారు.



జమ్మలమడుగు రూరల్ : పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు



బద్వేల్: ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు



కడప : ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు



ప్రొద్దుటూరు : నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

పారిశుద్ధ్యంపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-కలసపాడు : మండలంలోని అన్ని గ్రామీణ ప్రాంతాలలో పాఠశాలు, అంగన్వాడీ కేంద్రాల వద్ద నీరు నిల్వ ఉన్న చోట విద్యార్థులను ఉంచరాదని, గ్రామంలో పారి శుధ్యంపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎంపిడిఒ కోటేశ్వరరావు తెలిపారు. గురు వారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా డ్రింకింగ్ వాటర్ క్లోరినేషన్‌పై శానిటేషన్ హాస్టల్ విజిట్ తదితర అంశాలపై ఆయన చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు పడుతున్న సందర్భంలో గ్రామాల్లో కలుషిత నీటిని తాగడం, మలేరియా, కలరా , డెంగీ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని ముందస్తు చర్యలుగా మండల సభ్యులంతా కలిసి చక్కటి ప్రణాళిక బద్ధంగా గ్రామాలలోకి వెళ్లి ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఆయన అన్నారు. ముఖ్యంగా గ్రామానికి ప్రాంతాలలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులను క్లోరినేషన్ చేసి , చక్కటి తాగునీటిని అందిం చాలని పేర్కొన్నారు. పాఠశాలు ప్రారంభమైన నేపథ్యంలో వసతి గృహాలలో శాని టేషన్ చేయించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సాయి తేజ, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ అల్లా ప్రకాష్, ఎంఒఒ ప్రేమ్ సాగర్, మస్తాన్ వల్లి, పం చాయతీ కార్యదర్శులు కాశయ్య, శ్రీధర్, సృజన, రవీంద్రారెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సుజిత్, మేఘన, రమేష్, సుజిత, నాగేంద్ర, సయ్యద్ బాషా, సాయి, కృష్ణారెడ్డి వైద్య సిబ్బంది ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఐసిడి సూపర్‌వైజర్ హరిప్రియ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-కలసపాడు : మండలంలోని బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం ఇస్తున్నారా లేదా అని ఎంపిడిఒ కోటేశ్వరరావు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అందుకు కావాల్సిన సదుపాయాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని తెలిపారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత, మాట్లాడుతూ ప్రస్తుతం పాఠశాలలో 216 మంది విద్యార్థులు ఉన్నారని, వారికి మౌలిక సదుపాయాలు అవసరమైన మేర ఉన్నాయని తెలిపారు. సీజనల్ వ్యాధులు రాకుండా పాఠశాల చుట్టూ క్లోరినేషన్ చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ అల్లా ప్రకాష్, పంచాయతీ సెక్రటరీ శ్రీధర్, స్థానిక సర్పంచ్, కాంట్రాక్టర్లు రాంబాబు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

ప్రజాశక్తి-అట్లూరు

ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డెమొక్రటిక్ పిఆర్‌టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవిశంకర్, విద్యాధర్ పేర్కొన్నారు. గురువారం డెమొక్రటిక్ పిఆర్‌టియు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారుం. తల్లికి వందనం పథకాన్ని కేవలం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మాత్రమే ఇవ్వాలన్నారు. పభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న 117 జీవోను రద్దు చేయాలన్నారు. ఉన్నత పాఠశాలలో విలీనమైన 3,4,5 తరగతులను వెంటనే తిరిగి ప్రాథమిక పాఠశాలలకు పంపాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 10 దాటితే ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వారికి అవసరమయ్యే నోట్ బుక్స్, పలకలు, ఇతర విద్యా సామగ్రిని పంపిణీ చేయాలని పేర్కొన్నారు. ఉన్నత పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతో పాటు సమాంతరంగా తెలుగును కూడా కొనసాగించాలన్నారు.

ఆర్‌టిసి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లాలోని కడప, జమ్మలమడుగు ఆర్‌టిసి డిపోలలో పనిచేస్తున్న స్వీపర్లకు ఇస్తున్న వేతనాలలో కోత కోస్తున్న విక్టరీ అసోసియేషన్ ప్రోప్రైటర్, కాంట్రాక్టర్ వాసుదేవ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వీపర్లకు రూ.11,202 వేతనం ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.9,100 ఇచ్చి దోచుకోవడమే కాకుండా, తిరిగి రూ.3వేలు వెనక్కి తీసుకుంటున్నారని తెలిపారు. ఇఎస్ఐ, పిఎఫ్ సక్రమంగా కట్టడం లేదని పేర్కొన్నారు. కాంట్రాక్టర్‌గా చేరినప్పటి నుంచి ఇలాగే చేస్తున్నారని తెలిపారు. కడపలో బస్సులను క్లీన్ చేస్తున్న కార్మికులకు కేవలం రూ. 6వేలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. కార్మికులకు న్యాయం చేయాలని తెలిపారు. వెంటనే విచారణ చేపట్టి కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని, కాంట్రాక్టు రద్దు చేయాలని తెలిపారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని పేర్కొన్నారు.

'పింగళి' వర్ధంతి, జయంతులను ప్రతి ఏటా నిర్వహించాలి

ప్రజాశక్తి - కడప : రాబోవు రోజుల్లో నైనా పింగళి వర్ధంతి, జయంతి కార్యక్రమలను ప్రతి పాఠశాలలో నిర్వహించేలా అధికారలు చర్యలు తీసుకోవాలని నజుమున్ పాఠశాల ఉపాధ్యాయురాలు శారద, ఇన్సాఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్. గౌస్ బాషా కోరారు. రాయల్ కరీం సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం గౌస్ బాషా కార్యాలయంలో జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య 61 వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్కే సేవా సమితి అధినేత అబ్దుల్ షేక్ రాయల్ కరిముల్లా, జిఎంఆర్ రెసిడెన్స్ అధినేత మదర్ బాష పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- కడప అర్బన్ : అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం, ఛాయాపురం ఎంపిపి స్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం కార్మికురాలు సుంకమ్మ పై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. గురువారం విద్యుత్ భవన్ వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2003 సంవత్సరం నుంచి సుంకమ్మ పనిచేస్తోందని పేర్కొన్నారు. నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉన్నా, అతి తక్కువ వేతనం ఇస్తున్నా ఎలాంటి ఆరోపణలు లేకుండా పిల్లలకు వండి పెడుతోందని చెప్పారు.మహిళలని చూడకుండా దుర్భాషలాడుతూ భౌతిక దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. సుంకమ్మపై సుమారు 30 మంది మగవాళ్ళు వెళ్లిదాడికి దిగారని తెలిపారు. అవమానాన్ని భరించలేక ఆమె పురుగులు మందు తాగారని పేర్కొన్నారు. చావు బతుకుల్లో ఉన్న ఆమెకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని చెప్పారు.సమావేశంలో సిఐటియు విద్యుత్ యూనియన్ రాష్ట్ర నాయకులు నాయబ్ రసూల్, జిల్లా నాయకులు నాగసుబ్బయ్య, నాగమల్లయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-కలసపాడు : మండల కేంద్రంలో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సిపిఎం నాయకులు ప్రవీణ్, సుదర్శన్, నాగుర్వలి, జనసేన పార్టీ నాయకులు ఈశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుతం పాఠశాలలు తెరిచిన నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇకెవైసి చేయించుకునేందుకు ఆధార్ సెంటర్‌లకు ఇప్పటికే పరుగులు తీశారు. అయితే ఆధార్ కేంద్రం ఎక్కడ ఉందో ఎవరికి తెలియదు. గడచిన ప్రభుత్వం పిడుగుపల్లి తెల్లపాడు, గ్రామాలలో ఏర్పాటు చేసినట్లు చేసిందని, మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు.

అధికారులు సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి- గోపవరం : సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు సమయపాలన పాటించాలని, బయోమెట్రిక్ హాజరు తప్పని సరిగా వేయాలని, అన్ని రకాల రిజిస్ట్రర్లు సక్రమంగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి ఎం. నాగరాజ పేర్కొన్నారు. డయేరియా వ్యాధి ప్రబలుతున్న నేపథ్యంలో అన్ని పాఠశాలలు, కళాశాలలు, హాస్టల్స్, అంగన్వాడీ కేంద్రాలు, రెసిడెన్షియల్ పాఠశాలలలో శుభ్రమైన తాగు నీరు, పారిశుధ్యం ఉండాలన్నారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో మండలస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యక్తిగత శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. అన్ని స్థాయిల సిబ్బంది గ్రామాల్లో విస్తృతంగా పర్యటించాలన్నారు. ఫ్రైడే డ్రైడేగా నిర్వహించాలన్నారు. పిఎం కిసాన్ 5శాతం వెరిఫికేషన్ త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. పొద్దు తిరుగుడు హైబ్రిడ్స్ విత్తనాలు సబ్సిడీపై పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రాధాకృష్ణన్, ఇఒపిఆర్‌డి హసీనా, మెడికల్ ఆఫీసర్ మురళీకృష్ణ, హౌ సింగ్ ఎఇ రామకృష్ణ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డిఎస్‌సి ఎస్‌జిటికి ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు డిఎస్‌సి (సెకండరీ గ్రేడ్ టీచర్) పరీక్షకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వెనుకబడిన తరగతుల అధ్యయన కేంద్రం (ఎపి బిసి స్టడీ సర్కిల్) కడప ఉమ్మడి జిల్లా ఉమ్మడి సంచాలకులు డాక్టర్ వి. బ్రహ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన బిసి, ఎస్‌సి, ఎస్‌టి నిరుద్యోగ అభ్యర్థులు వార్షిక ఆదాయం లక్షలోపు కలిగి ఉన్నవారు, టిటిసి టేట్ అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మెరిట్, రిజర్వే షన్ ఆధారంగా 200 మంది అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. 60 రోజులు శిక్షణతో పాటు స్టడీ మెటీరియల్, స్టైఫండ్ ఇస్తామని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు మార్కుల జాబితాలు, ఆధార్ జిరాక్స్, బ్యాంకు పాస్‌పుస్తకం జిరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9703185382, 98499 19221లలో సంప్రదించాలన్నారు.

పేదరిక నిర్మూలనకు చదివే ఆయుధం : ఎమ్మెల్యే 'పుత్తా'

ప్రజాశక్తి-కమలాపురం : పేదరికంపై యుద్ధం చేయడానికి చదువే ఆయుధమని కమ లాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి పేర్కొన్నారు. కమలాపురం మండలం పెద్దచెప్పలి గ్రామంలో ఉండే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షా ఫలితాలలో మండల స్థాయిలో ప్రతమ, ద్వితీయ, తృతీయ స్థానం మా ర్కులు సాధించిన విద్యార్థులకు, కీర్తిశేషులు పుత్తా మారుతి మోహన్‌రెడ్డి జ్ఞాప కార్థం తండ్రి పుత్తా ఎల్లారెడ్డి ప్రోత్సాహక బహుమతులను కమలాపురం శాస నసభ్యులు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాలను గుర్తుపెట్టుకుని ఇష్టంతో బాగా చదివి ఉన్నత స్థాయికి వెళ్లాలని పేర్కొన్నారు. చదువుతోనే పేదరికం అంతం చేయవచ్చు అని తెలిపారు. ఈ సందర్భంగా బహుమతుల ప్రదాత పుత్తా ఎల్లారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్స హించడానికి ప్రతి ఏటా బహుమతులను తమ కుమారుడు జ్ఞాపకార్థం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ పాఠశాల పూర్వ విద్యార్థిగా తాను పాఠశాల అభివృద్ధికి ఎల్లప్పుడు తోడ్పడుతానని తెలిపారు కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఓబుల్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి బేబీ, జిల్లా తెలుగుదేశం యువ నాయకులు పుత్తా లక్ష్మి రెడ్డి, పుత్తా ఎల్లారెడ్డి కుటుంబ సభ్యులు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు, పాఠశాల పూర్వ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పుత్తా చైతన్యరెడ్డి



అధికారులతో ఆరా తీస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

కల్లూరు కాలువ ఆక్రమణలను పరిశీలించిన 'వరద'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు-జమ్మలమడుగు బైపాస్‌పై వెళ్లే మైలవరం దక్షిణ కాలువలో భాగమైన కల్లూరు కాలువ ఆక్రమణలను గురువారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పరిశీలించారు. గత కొంతకాలంగా కాలువ ఆక్రమణలపై ఎమ్మెల్యే ప్రత్యేకదృష్టి సారించారు. ఇందులో భాగంగా జలవనరుల శాఖ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ కాలువపై ఆక్రమణ దారులు నిర్మాణాలు చేపట్టిన విషయాన్ని పరిశీలించారు. అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆరా తీశారు. మ్యాప్ ద్వారా అన్ని వివరాలు సేకరించారు. తదుపరి చర్యల కోసం అధికారులతో చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మహేశ్వరరెడ్డి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.



అభివృద్ధికి నోచని కాలనీ

అభివృద్ధికి నోచని నెర్రవాడ ఎస్‌టి కాలనీ

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని నెర్రవాడ గ్రామ సమీపాన ఉన్న ఎస్‌టి కాలనీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. యానాది, ఎరుకల సంతతికి చెందిన 20 కుటుంబాల వారు గత 25 ఏళ్లకుపైగా ఇక్కడ నివాసం ఉంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాం నుండి రోడ్లు, గృహాలు మంజూరు చేయకపోవడంతో పూరి గుడిసెల్లోనే వారు నివాసం ఉంటున్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు ఈ కాలనీలో వెచ్చించి అభివృద్ధి చేయాలని పలు మార్లు అధికారులు నివేదికలు సిద్ధం చేసినప్పటికీ అవి ఆచరణలో అమలు కావడంలో విఫలమయ్యాయి. గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ఆ కాలనీలోనే అభివృద్ధి పరచాలని ఆదేశాలు కూడా జారీ అయ్యాయి. అయితే నెర్రవాడ ఎస్‌టి కాలనీ ఆ నిధులకు నోచుకోలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం కూడా ఈ కాలనీ అభివృద్ధి గురించి పట్టించుకోలేదు. దీంతో నేటికీ అభివృద్ధి దూరంగానే ఉంది. వృత్తి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వీరికి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదరణ లేదు. గతంలో విద్యుత్ సరఫరా కూడా లేక నానా అవస్థలు పడే వారు. కాలనీ అభివృద్ధికి నోచుకోక కంపచెట్ల మధ్య ఉంది. ఈ మధ్యకాలంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి కరెంటు వసతి మాత్రం కల్పించారు. ఈ కాలనీ సమీపంలో జగనన్న కాలనీ నిర్మాణం అవుతోంది. పేదలకు స్థలం మంజూరు చేసి ఇళ్లు నిర్మిస్తున్నారు. నూతన కాలనీతోపాటు ఎస్‌టి కాలనీనిఅభివృద్ధి చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



రోడ్డుకు నోచని కాలనీ

క్రైం కార్నర్



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సిఐ దస్తగిరి

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ముద్దనూరు

చిన్నదుద్యాల గ్రామ సమీపంలో ఉన్న తార ప్లాంటులో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న గండి ఓబులేసు (46) ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సిఐ దస్తగిరి తెలిపారు. సిఐ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్న దుద్యాల గ్రామానికి చెందిన గండి ఓబులేసు గ్రామ సమీపంలో ఉన్న నెల్లూరుకు చెందిన తిరుపతిరెడ్డి తార ప్లాంటులో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఇంటి నుండి ప్రతి రోజు సాయంత్రం 6గంటలకు పనికి వెళ్లి మరుసటి రోజు ఉదయం ఇంటికి వచ్చేవాడు. బుధవారం యధావిధిగా పనికి వెళ్లాడు. మరుసటిరోజు ఉదయం ఇంటికి రాలేదు. కుంటుంబ సభ్యులు ప్లాంటు వద్దకు వెళ్లి చూడగా గదిలో ఫ్యానుకు లుంగీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్లాంటు వద్ద కొన్ని మోటర్లు కనబడకుండా పోవడంతో ప్లాంటు యజమాని ఏమైనా అంటాడని భయపడి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సిఐ తెలిపారు. మృతుడి బార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ చెప్పారు.

బొగ్గు వ్యాగన్‌లో గుర్తుతెలియని మృతదేహం

రెండు రోజుల కిందట కృష్ణపట్నం పోర్టు నుంచి ఆర్‌టిపిపికి బొగ్గు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని రాయలసీమ థర్మల్ తాప విద్యుత్ కేంద్రంలో బొగ్గు వ్యాగన్లలో గుర్తుతెలియని మృతదేహం గురువారం బయటపడింది. రెండు రోజుల క్రితం కృష్ణపట్నం పోర్టు నుంచి ఆర్‌టిపిపికి బొగ్గు వ్యాగన్లు వచ్చాయి. అందులోని బొగ్గును యూనిట్లకు సరఫరా చేయుటకు ఆఫర్లలో డంప్ చేస్తుండగా వ్యాగన్ టిప్లర్-2లో ఒక పురుషుడి మృతదేహం బయటపడింది. చూసిన కార్మికులు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే ఆర్‌టిపిపి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఉన్నతాధికారులు అక్కడికి చేరుకొని ఎస్పీఎఫ్, పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. మరణించిన వ్యక్తి ఎవరు.. ఇక్కడికి ఎలా వచ్చింది.. అనేదానిపై పోలీసులు, ఎస్పీఎఫ్ సిబ్బంది విచారిస్తున్నారు.

అగ్నిమాపక కేంద్ర నిర్మాణం జరిగేనా..

నాలుగేళ్ల కిందట మంజూరు - నిరుపయోగంగా స్థలం - కూటమి ప్రభుత్వంలోనైనా పూర్తయ్యేనా..?

ప్రజాశక్తి - ముద్దనూరు

అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి ముద్దనూరు ఎప్పుడు నోచుకుంటుందోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం ముద్దనూరుకు అగ్నిమాపక కేంద్రాన్ని మంజూరు చేసింది. అధికారుల నిర్లక్ష్యంతో కనీసం పునాదులు కూడా పడలేదు. జమ్మలమడుగు తాలూకాకు సంబంధించి ఒకటే అగ్నిమాపక కేంద్రం ఉంది. దీని పరిధిలో జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం, ముద్దనూరు, ఎర్రగుంట్ల, కొండాపురం మండలాలు ఉన్నాయి. ముద్దనూరు, ఎర్రగుంట్ల, కొండాపురం మండలాల్లో ప్రమాదవశాత్తూ ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే అగ్నిమాపక వాహనం జమ్మలమడుగు నుండి రావాల్సిందే. జమ్మలమడుగు నుండి ముద్దనూరు 18, ఎర్రగుంట్ల 36, కొండాపురం 40 కిలోమీటర్లు ఉంది. వాహనం జమ్మలమడుగు నుండి ఇక్కడికి వచ్చేలోపు ప్రమాదం తీవ్రమై భారీ నష్టం జరిగేది. దీన్ని దృష్టిలో పెట్టుకుని గత వైసిపి ప్రభుత్వం 2020లో ముద్దనూరుకు అగ్నిమాపక కేంద్రాన్ని మంజూరు చేసింది. భవనం, ప్రహరీ నిర్మాణానికి దాదాపు రూ.కోటి 20 లక్షలు నిధులు మంజూరు చేసింది. ఆ మేరకు రెవెన్యూ అధికారులు తాడిపత్రి రహదారిలోని చెన్నారెడ్డిపల్లె వద్ద పాత సర్వే నంబర్ 56-1సబ్ డివిజన్ చేసిన తర్వాత కొత్త సర్వే నెంబర్ 56-3లో 0.78 ఎకరా స్థలాన్ని కేటాయించారు. నాలుగేళ్లు గడిచినా నేటికి భవన నిర్మాణానికి కనీసం పునాది రాయి కూడా పడలేదు. ఇక్కడ అగ్నిమాపక కేంద్రం ఏర్పాటైతే ముద్దనూరు, కొండాపురం, ఎర్రగుంట్ల మండలాలు కాకుండా పులివెందుల నియోజకవర్గంలోని సింహాద్రిపురం, తొండూరు మండలాలకు కూడా అందుబాటులో ఉంటుంది. కొన్ని రోజుల క్రితం నల్లబల్లెలో గడ్డివామి దగ్ధమైంది. స్థానిక నాలుగు రోడ్ల వద్ద లారీ టైరులో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక కేంద్రంలో ఒక ఆఫీసర్, ముగ్గురు లీడింగ్ ఫైర్‌మెన్లు, ఆరుమంది ఫైర్‌మెన్లు, ముగ్గురు డ్రైవర్ ఆపరేటర్లు ఉంటారు. ఈ చుట్టు పక్కల మండలాల్లో అగ్నిప్రమాదం సంభవిస్తే వెంటనే స్పందించి ఆస్తి నష్టాన్ని తగ్గించి ప్రాణ నష్టం జరగకుండా ఉండేందుకు వీలుగా ఉంటుందని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. భవన నిర్మాణ జాప్యానికి గల కారణాలేంటో తెలియడం లేదని స్థానికుల్లో చర్చ సాగుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే అగ్నిమాపక కేంద్ర నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. కనీసం కూటమి ప్రభుత్వంలోనైనా అగ్నిమాపక కేంద్రం నిర్మాణం జరుగుతుందో లేదోనని ప్రజలు చర్చించుకుంటున్నారు.



అగ్నిమాపక కేంద్రానికి చెన్నారెడ్డిపల్లె వద్ద కేటాయించిన స్థలం

స్వాతంత్ర్య పోరాటంలో 'అల్లూరి' పాత్ర కీలకం



వేంపల్లె : అల్లూరి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి, నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

స్వాతంత్ర్య సమరయోధులు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఈ తరం యువతకు ఆదర్శనీయమని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ స్పందన హాలులో స్టెప్, పర్యాటక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 127వ జయంతి ఉత్సవాల కార్యక్రమానికి డిఆర్‌ఒతో పాటు స్టెప్ సిఇఒ సాయి గ్రెస్, డిటిసి మీరా ప్రసాద్, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, జిల్లా సాంస్కృతిక పర్యాటక శాఖాధికారి, మల్లికార్జున ముఖ్య అతిథులతో హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ నేటి సమాజానికి అల్లూరి సీతారామరాజు ధైర్య సాహసాలు ఆదర్శనీయని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుల త్యాగాలను మరువరాదని, ఆయన ధైర్య సాహసాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. భారత స్వాతంత్ర్య చరిత్రలో అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వల శక్తి అని, ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయమని చెప్పారు. సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం వస్తుందని నమ్మి, అందుకోసం తన ప్రాణాలర్పించిన యోధుడన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని చాటుకున్న విప్లవ వీరుడన్నారు. అంతకుముందు ముఖ్య అతిధులు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఒ వెంకట్రావు, సాంఘిక సంక్షేమ శాఖ డిడి సరస్వతి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. **జిల్లా పోలీస్ కార్యాలయంలో..** స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ ఘన నివాళి అర్పించారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. భారత దేశ స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి సీతారామరాజు పాత్ర కీలకమైందని, పరిమిత వనరులతో బ్రిటిష్ వారిని గడగడలాడించిన పోరాటయోధుడని ఎస్.పి కొనియాడారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **డాక్టర్ వైఎస్ఆర్ ఎఎఫ్‌ఎయులో..** తెలుగుజాతి తెగువకు నిలువెత్తు నిదర్శనమైన మన్యం వీరుడు అల్లూరి జీవితం తరతరాలకు స్ఫూర్తిదాయకమని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రాజేష్ కుమార్ రెడ్డి అన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో గురువారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు127 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల కో-ఆర్డినేటర్లు, జాతీయ సేవా పథక ప్రోగ్రాం ఆఫీసర్లు, నేషనల్ ఈవెంట్ కో-ఆర్డినేటర్ మనోహర్‌రావ్ పాల్గొన్నారు. **ఆర్ట్స్ కళాశాలలో..**

కడప : అల్లూరి సీతారామరాజు దేశభక్తిని ఈనాటి యువత ఆదర్శంగా తీసుకొని విజయపథంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ అన్నారు. గురువారం కడప ప్రభుత్వ పురుషుల కళాశాలలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒలు పి.శివరామకృష్ణ డాక్టర్ అంకాల నాగరాజు, లీల వర్ధిని, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బద్వేలు : స్వాతంత్ర్య ఉద్యమంలో చురుగ్గా పాల్గొని ఆంగ్లేయ గుండెల్లో దడదడలాడించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అని అధ్యక్షులు డాక్టర్ మీనాక్షి రెడ్డి అన్నారు. గురువారం అల్లూరు సీతారామరాజు 127 జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పెన్షన్ అసోసియేషన్ గౌరవ సలహాదారులు గడి పుల్లంరాజు, అసోసియేట్ అధ్యక్షులు గంజిగుంట, పుల్లయ్య కార్యదర్శి కత్తి బ్రహ్మయ్య, కోశాధికారి గంగన్న, ఆర్గనైజింగ్ కార్యదర్శి ముండ్లపాటి పిచ్చయ్య ఉపాధ్యక్షులు, ప్రసాద్ సుబ్బరాయుడు, నరసరాజు, చిన్న రాయుడు, శ్రీనివాస్ రెడ్డి, రామకోటి, రాజు, చిన్న రాయుడు, పాల్గొని ఆయనకు ఘనంగా నివాళులర్పించారు

వేంపల్లె : దేశ స్వాతంత్ర్య పోరాటంలో మన్యం వీరుడైన ఆల్లూరి సీతారామరాజు పాత్ర కీలకమని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు 127వ జయంతి సందర్భంగా గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అల్లూరి చిత్ర పటానికి తులసిరెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అల్లూరి జయంతి వేడుకలను ఘనంగా చేశారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ పరిమిత వనరులతో బ్రిటిష్ వారిని గడగడలాడించిన వీరుడు అల్లూరి అన్నారు. విశాఖ మన్యం ప్రాంతంలో గిరిజనులపై ఆంగ్లేయుల ప్రభుత్వం సాగిస్తున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక, ధన, మాన, ప్రాణ దోపిడీకి వ్యతిరేకంగా అల్లూరి సాయుధ పోరాటం చేశారని తెలిపారు. ఆల్లూరి దేశ భక్తుడు, త్యాగశీలి అన్నారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి రోశయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఓబుల్‌రెడ్డి, కాంగ్రెసు నాయకులు ఉత్తన్న, రామకృష్ణ, బద్రి, బాలం సుబ్బరాయుడు, వేమయ్య, వినయ్, శివ పాల్గొన్నారు.



జమ్మలమడుగు రూరల్ : నివాళులు అర్పిస్తున్న జనసేన నేతలు

జమ్మలమడుగు రూరల్ : స్వాతంత్ర సమరయోధుడు మన్యం దొర అల్లూరి సీతారామరాజు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహన్‌రంగా నేటి యువతకు స్ఫూర్తి ప్రదాతలని జమ్మలమడుగు జనసేన కో-ఆర్డినేటర్ నల్లంశెట్టి నాగార్జున తెలిపారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో నల్లంశెట్టి నాగార్జున, జనసేన నేత వనం గురుకుమార్, వంగవీటి రాధా రంగా మిత్ర మండలి కడప జిల్లా అధ్యక్షులు అమ్మినగారి మురహరి రాయల్ ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జనసేన ప్రోగ్రామ్ కమిటీ మెంబర్ పవన కుమార్, కాటమరాయుడు, వినయ్, సుధాకర్ జనసైనికులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : స్వాతంత్ర సంగ్రామంలో అల్లూరి సీతారామరాజు చూపిన తెగువ, పట్టుదల మనందరికీ ఆదర్శనీయమని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు తెలిపారు. గురువారం స్థానిక మహిళా డిగ్రీ కళాశాలలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపల్ ఎల్.సుధీర మాట్లాడుతూ మన్యం వాసులు తమ హక్కుల కోసం పోరాటంలో వారికి మనోధైర్యం నింపాడని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ బాల నారాయణ, ఎన్ఎస్ఎస్ పిఒ డాక్టర్ యు శ్రీనిత, డాక్టర్ ఎస్ సుగుణ, డాక్టర్ కె.విజయలక్ష్మి, అధ్యాపకలు, సిబ్బంది పాల్గొన్నారు.



పులివెందుల రూరల్ : అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

రేపు కడప స్పిరిట్ డిగ్రీ, పీజీ కళాశాలలో జాబ్‌మేళా

ప్రజాశక్తి - ఖాజీపేట

కడప నగరం రిమ్స్ రోడ్డులో ఉన్న స్పిరిట్ డిగ్రీ అండ్ పీజీ కళా శాలలో ఈనెల 6న శనివారం జాబ్‌మేళా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గురువారం ఇఒపిఆర్‌డి వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. గురువారం ఉదయం 9 గంటలకు జాబ్ మేళా ప్రారంభమవుతుందన్నారు. ఏదైనా డిగ్రీ, పీజీ కోర్సులో ఉత్తీర్ణులై, 30 సంవత్సరాలలోపు ఉన్న అభ్యర్థులు అర్హులని తెలిపారు. తమ అర్హతా పత్రాలతో అభ్యర్థులు సకాలంలో చేరుకోవాలని కోఆరరు.

స్పిరిట్స్ కళాశాల ప్లేస్మెంట్ అధి కారి ఎస్ఎండి మునీర్ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఇఒపిఆర్‌డి పేర్కొన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇఒపిఆర్‌డి వెంకటసుబ్బారెడ్డి కోరారు.

భోలే బాబాను వెంటనే అరెస్టు చేయాలి



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

భోలే బాబాను వెంటనే అరెస్టు చేయాలని జమ్మలమడుగు సిపిఎం కార్యదర్శి జి.ఏసుదాసు, పార్టీ నాయకులు దాసరి విజయ్ డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ అత్రాస్ జిల్లా పులరై గ్రామంలో సూరత్ సింగ్ (అలియాస్)భోలే బాబా సత్సంగ్ పేరుతో నిర్వహించిన ఆధ్యాత్మిక సభలో బోలె బాబా ప్రసంగం అనంతరం ఆయన నడిచిన పాదాల కింద మట్టిని తీసుకోవాలని సత్సంగుకు వచ్చిన ప్రజలు తోపులాట గురై 125 మంది మరణించారన్నారు. మృతుల్లో ఎక్కువమంది ఆడవారు, చిన్న పిల్లలు ఉండడం బాధాకరమన్నారు. ఈ విషాదానికి కారకులైన ప్రధాన కార్య నిర్వాహకుడు బోలె బాబాను వెంటనే అరెస్టు చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తుందన్నారు. చుట్టుపక్కల రాష్ట్రాలలో బోలె బాబాకు వేలకోట్లలో ఆస్తులు ఉన్నాయని, వాటిని వెంటనే ఆ రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. ఇదివరకే బోలె బాబా మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని ఆరోపించారు. ఆధ్యాత్మిక ముసుగులో ఎన్నో మోసాలకు పాల్పడ్డాడని ఆయనపై తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయని వారు పేర్కొన్నారు. అయినప్పటికీ అత్రాస్ జిల్లా పోలీస్‌శాఖ భోలే బాబాపై చర్యలు తీసుకోకపోవడం చాలా దుర్మార్గమని పేర్కొన్నారు. వెంటనే ఆ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు మూఢనమ్మకాలపై సదస్సులు, సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. ఆధ్యాత్మిక ముసుగులో మోసపోతున్న ప్రజలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. మృతుల కుటుంబాలకు ఆ రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం చాలా దుర్మార్గమన్నారు. వెంటనే బాధిత ఒక్కో కుటుంబానికి రూ.10లక్షలు యుపి ప్రభుత్వం ప్రకటించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదాము, దివాకర్, ఎ.వినయ్‌కుమార్ పాల్గొన్నారు.



నూతన చట్టాల గురించి వివరిస్తున్న ఐసిడిఎస్ సిబ్బంది

నూతన చట్టాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక వెలుగు కార్యాలయంలో నూతనంగా ప్రవేశపెట్టిన క్రిమినల్ చట్టాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ మైదుకూరు సిడిపిఒ శ్రీదేవి చట్టాలపై వివరించారు. ఐపిసి, సిఆర్‌పిసి వాటి స్థానంలో నూతనంగా ప్రవేశపెట్టిన చట్టాల గురించి తెలిపారు. మహిళల చట్టాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు భారతి, రమాదేవి, జహరాబి, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న సిఐ బాల మద్దిలేటి

పులివెందుల రూరల్ : మహిళలు కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రూరల్ సీఐ బాల మద్దిలేటి తెలిపారు. పట్టణంలోని ఎంపిడిఒ సభా భవనంలో భారత న్యాయ సంహిత 100 రోజుల యాక్షన్ ప్లాన్‌పై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని ఐసీడీయస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ సిబ్బంది, మహిళా పోలీసులకు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బాల మద్దిలేటి హాజరయ్యారు. శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా లీగల్ ప్రొబేషన్ ఆఫీసర్ సునీత రాజు ద్వారా ఇప్పించారు. కొత్త చట్టాల పట్ల ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని సీఐ వివరించారు. ఐసీడీస్ సీడీపీఓ శ్రీలత మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టాలపైన ప్రతి ఒక్కరికీ అవగాహనా ఉండాలన్నారు. కార్యక్రమంలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి - చాపాడు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మండల పరిధిలోని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్యే కంద్రంలోని అయ్యవారిపల్లె సచివాలయం పరిధిలో రాజువారిపేట గ్రామంలో ప్రజలంతా మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని మండల ఆరోగ్య విస్తరణ అధికారి ఎం.రాఘవయ్య పేర్కొన్నారు. గురువారం రాజువారిపేట గ్రామంలో అంగ న్వాడీ కేంద్రంలో అడల్ట్ బీసీజీ వాక్సినేషన్ ప్రోగ్రాంను విజిట్ చేశారు. క్షయ వ్యాధి రాకుండా ప్రజలు బీసీజీ టీకాలు వేయించుకోవాలని సూచించారు. ప్రజ లంతా మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. మనోవైకల్యంతో ఇబ్బంది పడు తున్నవారు కడప రిమ్స్ వైద్య శాలలో ఉచితంగా వైద్య సేవలు అంది స్తున్నారని తెలిపారు. తనలో తాను మాట్లాడుకోవడం, భయం, అనుమానం, నిద్రలేమితో ఆందోళన, నిస్సహాయత, ఎవరో ఏదో చేస్తారని భయందోళనకు గురవుతారని తెలిపారు. అలాంటి లక్షణాలు ఉన్నవారిని వెంటనే రిమ్స్ వైద్యశాలకు తీసుకెళ్లి చికిత్స చేయించుకోవాలని కోరారు. సైక్రియాట్రిక్ సోసియల్ వర్కర్ పి.భాస్కర్ మాట్లాడుతూ మానసిక రోగులను నిరంతరం గమనిస్తూ ఉండాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్స్ సరస్వతి, బాబురెడ్డి, ఎంఎల్‌హెచ్‌పి ఉషా, ఎఎన్ఎం సింధూ, ఆశా కార్యకర్త పార్వతి, అంగన్వాడీ కార్యకర్త ఝాన్సీరాణి, అంగన్వాడీ ఆయా మల్లేశ్వరి, ప్రజలు పాల్గొన్నారు.

ఆహార పదార్థాల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఆహార పదార్థాల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి హోటల్ యజమానులకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్టాప్ డయేరియా ప్రోగ్రాంలో భాగంగా గురువారం పట్టణంలోని హోటళ్లను కమిషనర్ సిబ్బందితో కలిసి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ఉన్న అన్ని హోటళ్లల్లో పరిశుభ్రంగా ఉండాలన్నారు. కల్తీ లేని ఆహారాన్ని ప్రజలకు అందించాలని సూచించారు. శుభ్రమైన ఫిల్టర్ నీటిని మాత్రమే వినియోగించాలని ఆదేశించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో హోటళ్ల యజమానులతో సమావేశమై తగిన సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ టి మురళీధర్, అసిస్టెంట్ ఇంజనీర్ ఏకనాథ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

- ఈ ఖరీఫ్ సీజన్ నుంచి పాత విధానంలోనే పంటల బీమా : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్



హరికిరణ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

ఎన్నికల సమయంలో రాయలసీమ రైతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు 2019 కన్న ముందున్న పంటల బీమా విధానాన్ని ఈ ఖరీఫ్ నుంచే ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి తెలిపారు. పాత పద్ధతిలోనే బీమా అమలు చేయాలని ముఖ్యమంత్రి వ్యవసాయాధికారులను ఆదేశించిన నేపథ్యంలో ఎమ్మెల్సీ గురువారం వ్యవసాయశాఖ కమిషనర్ హరికిరణ్‌ను అమరావతిలో కలిసి చర్చించారు. రైతులకు సంబంధించిన పలు అంశాలపై ఆయన హరికిరణ్‌తో చర్చించారు. సీమ రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.